వ్యాపారస్తుడు

"స్సార్! అర్జెంటుగా ఓ వంద రూపాయలు కావాలి".

ఎప్పుడూ నన్ను అప్పు అడగని యాదయ్య దాదాపు కళ్ళనీళ్ళ పర్యంతంగా అంత డబ్బు అడగటం నాకు కొద్దిగా ఆశ్చర్యం అనిపించింది. మా ఆఫీసులో పేరుకి ప్యూన్‌గా పనిచేస్తున్నా, మా గుమాస్తాలు చాలామంది కన్నా యాదయ్య ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగగా వుంది

వడ్డీమీద రహస్యంగా చాలామంది వాడి దగ్గర వందలకి వందలు అప్పు తీసుకొనటం నాకు తెలుసు. కాని అంతా గప్‌చిప్‌గా వుంచటం వాడిలోని ప్రత్యేకత.

అలాంటి యాదయ్యకే డబ్బవసరం వచ్చి అడిగితే 'లేదు' అనలేకపోయాను.

"రేపు వుదయం ఇస్తాను. తీసుకు రాలేదు" అని చెప్పాను.

"మీ ఇంటికి వస్తాను సార్. ఇవాళే కావాలి" అన్నాడు కొద్దిగా వేడుకోలుగా.

లంచ్ అవర్‌లో కాఫీ కోసం ఇంటికి వెళ్ళినప్పుడు గుర్తుపెట్టుకుని అమ్మనడిగి వంద తీసుకొచ్చి ఇచ్చాను యాదయ్యకి.

"జీతం రాగానే ఇచ్చేస్తాను సార్" అన్నాడు కృతజ్ఞతగా.

అదేరోజు వుదయం మా ఆఫీస్‌లో పనిచేసే ఎకౌంటెంట్ ఓ డబ్భయి అయిదు రూపాయలు వుంటే సర్దమని అడిగాడు నన్ను.



"సారీ లేవు" అని చెప్పాను.

ఆయనెప్పుడూ ఆర్థికంగా అవస్థ పడుతుంటాడు. అలాంటి ఆయనకి ఇవ్వాలి నిజానికి. కాని ఆయనకి 'నో' అని, వడ్డీలమీద సంపాదించే యాదయ్యకి 'నో' అని ఎందుకు అనలేకపోయాను ?

సాయంత్రం ఇంటికి వెళుతుంటే ఆ ఆలోచన వచ్చింది. కాని నా మనసుకి నాకు సబబయిన కారణం తోచలేదు. పుష్కలంగా డబ్బుండే యాదయ్యకి మంచివాడు అనే ఉద్దేశంతో, స్వార్థంతో లేదనాలనిపించలేదు బహుశా.

మర్నాడు హృదయం ఎకౌంటెంట్ సీట్ దగ్గరకి వెళ్ళాను, జేబులో డబ్భై అయిదు రూపాయలతో.

"అనుకోకుండా మా తమ్ముడికి బోనస్ వచ్చింది. నిన్న లేదన్నాను సార్" అన్నాను డబ్బు బయటకి తీసి.

ఆయన చిన్నగా నవ్వి తల అడ్డంగా వూపుతూ చెప్పాడు.

"అసలు మిమ్మల్ని అడిగేవాడిని కాదు. యాదయ్యని అడిగితే వాడిదగ్గరా లేవు. అప్పుడడిగాను మిమ్మల్ని. కాని నిన్న సాయంత్రం వాడే ఎక్కడో ఓ వంద పుట్టించుకువచ్చి ఇచ్చాడు, మామూలుకన్నా ఓ రూపాయి ఎక్కువ వడ్డీమీద."

"వెరీ సారీ."

ఈసారి మనస్ఫూర్తిగా చెప్పాను.